(మినీ కథ)

# వెర్రిబాగులోడు

ఏ. శారద

"రిక్షా" శివరావు పిలిచాడు. అతని అడుగులు తడబడుతూవున్నాయి. మాటలు ముద్దగా వస్తున్నాయి. కష్ట పడుతున్నా గూడా స్పష్టంగా పలకడం లేదు.

"నెహ్రూ పార్కు తెలుసుగా?"

"తెలుసు బాబూ!"

"ఆ పక్క వీధిలోకి పోవాలి."

"పదండి బాబూ! పోదాం! ఎక్కండి మరి!"

"ఎంత కావాలి?"

"తమరి యిష్టం బాబూ!"

"అలా మొహమాటంలో పడేయకు నన్ను. నాదసలే జాలి గుండె."

"సరే! రూపాయినర యివ్వండి."

"రూపాయిన్నరా యింకేమన్నా నా? రూపాయి యిస్తాను. వస్తేరా. లేకుంటే యింకో రిక్షా చూసుకుం టాను."

కొంచెం బెట్టుచేసి చివరకు ఒప్పు కున్నాడు రిక్షావాడు. శివరావు బండె క్కాడు గర్వంగా, తన మాట సాగి నందుకు.

'బ్లూ' రెస్టారెంట్‌లో ఫ్రెండ్సు పార్టీ చేశారు శివరావుకి. తెల్లగుర్రం మీద అనేకసార్లు రౌండ్లు కొట్టాడు. టైము గడిచిందే తెలియని మనోలోకపు వీధుల్లో విహరించి, విహరించి చివరికి బయటకు వచ్చాడు.

రిక్షా తప్ప మరే వాహనమూ కంట బడలేదు.

"వచేశాం బాబూ!"

"ఆఁ.. వచ్చేశామా! ఆఁ.. తెల్ల బిల్డింగు ముందు ఆపు."

రిక్షా ఆగింది.

"ఇంద ... తీసుకో."

రూపాయినోటిచ్చాడు శివరావు. రిక్షా వాడు కదల బోయాడు.

"ఇదిగో. యింకా అర్ధరూపాయి యివ్వవద్దూ! చిల్లరలేదు. నలభై పైసలే వున్నాయి. ఫరవాలేదా?"

సరిగ్గా నిలబడ లేక పోతున్నాడు శివరావు.

"పరవాలేదు బాబూ! తమరి యిష్టం అని ముందే చెప్పానుగా!"

రిక్షా కదిలింది.

"పాపం ఎంత వెర్రి బాగులోడు!" అనుకున్నాడు, శివరావు ముందుకు నడుస్తూ.

# వ్యత్యాసం

కలచవీడు మురళీధర్

వెర్రాడు వారిన కొమ్మమీద
గొంతు విప్పింది కోయిల.
శిథిల కుటీరాన
తల్లి ఊపింది ఊయెల.
ఋతువును మార్చాలని
కోయిల ఆలాపన.
బ్రతుకును ఈడ్చాలని
కన్నతల్లి ఆవేదన.
రెండిటికీ వ్యత్యాసం రవ్వంతే.
ఇద్దరిలో వినిపించేది వొకేగొంతే.
ఉన్నది మారాలని.
లేనిది రావాలని.